


## నెలనెలా నవ్వుల పండగ

## కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకటకృష్ణమూర్తి

వెంగళ్రావ్ కొంతకాలం లాయర్ గా ప్రాక్టీస్ చేశాడు. అతను కోర్టులో పార్టీలని క్రాస్ ఎక్జామిన్ చేసే విధానాన్ని గమనించండి..

*ప్రశ్న:* డాక్టర్! నిద్రలో ఓ వ్యక్తి మరణిస్తే , మర్నాడు ఉదయం అతను నిద్రలేచేదాకా 1 సంగతి అతనికి తెలుస్తుందా? తెలీదా?

*మరో ప్రశ్న:* ఈ ఫోటోలో ఉన్నది నువ్వే అంటున్నావు. దీన్ని తీసినప్పుడు నువ్వక్కడే ఉన్నావని తెలిపే సాక్ష్యం ఏదయినా ఉందా?

*ఇంకో ప్రశ్న:* ఆమెకి ముగ్గురు పిల్లలు కదా?

*జవాబు:* అవును

*ప్రశ్న:* ఎంతమంది కొడుకులు?

*జవాబు:* ఇద్దరు

*మళ్ళీ ప్రశ్న:* కూతుళ్ళూ?

❀❀

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"**మహిళా** మహాసభల్లో స్త్రీలందరూ నిశ్శబ్దంగా వుండే సందర్భం ఉంటుందంటావా అసలు? "

"ఓ! తప్పకుండా ఉంటుంది"

"ఎప్పుడు?"

"సభాధ్యక్షురాలు లేచి వయసులో, అనుభవంలో కాస్త పెద్దవారిని వేదికమీదకు వచ్చి మాట్లాడమంటే సరి. అంతా గప్‌చిప్"

❦❦❦

**ఓ** పెద్ద మనిషి ఓ యువకుణ్ణి పిలిచి "ఏంటోయ్! నీ వరసేం బావుండలేదు. పెళ్ళికాని అమ్మాయిలకి అనవసరంగా ఆశలు చూపి మోసగిస్తున్నావట. అదీగాక మూడు ఊళ్ళలోని అమ్మాయిలతో ఏకకాలంలో ఒకరి విషయం మరొకరికి తెలీకుండా పెళ్ళిళ్ళు కూడా ఏర్పాటు చేసుకున్నావట. ఏమిటి సంగతి? ఈ పనులన్నీ ఎలా చేస్తున్నావసలు?" అనడిగాడు.

"ఏముంది? నాకు మోటారు సైకిలుందిగదా పెద్ద కష్టమేమీలేదు" అన్నాడు యువకుడు సిగ్గుపడుతూ.

❦❦❦

**పత్రికా** సంపాదకుడు ఇంటర్వ్యూకి వచ్చిన వ్యక్తిని ప్రశ్న వేస్తున్నాడు.

సంపాదకుడు: "ప్రూఫ్‌రీడర్‌గా ఉద్యోగం చేయడానికి వచ్చారన్నమాట."

అభ్యర్థి: "అవును సార్"

సంపాదకుడు: "ఊఁ! అయితే ఆ ఉద్యోగంలోని సాధక బాధకాలు, బాధ్యతలూ తెలుసా?"

అభ్యర్థి: "తెలుసుసార్. జర్నలిస్టులు ఏదైనా పొరపాటు చేసినపుడు దాని బాధ్యతంతా నా మీద వేసుకోవాలి" వినయంగా జవాబిచ్చాడు.

❦❦❦

**అద్దెకొంప** కోసం తిరిగి తిరిగి విసుగెత్తిన అప్పారావు బ్రోకర్ చూపించిన ఆఖరి ఇల్లుచూసి మూర్ఛపోబోతూ ఆ ఇంటావిడను అడిగాడు వ్యంగ్యంగా.

"ఇంతకీ ఈ పందుల దొడ్డికి అద్దె ఎంతండీ?"

ఆవిడ తకీమని జవాబిచ్చింది - "ఉండేది పెద్ద పందులు మాత్రం అయితే వంద. అల్లరి చేసే పిల్ల పందులు కూడా ఉంటే నూట పాతిక."

❦❦❦

**"అసలు** మీ జీవితంలో ఒక్కసారన్నా సరిగా చెప్పిన టైముకొచ్చారా! ఆఖరికి మన పెళ్ళి సమయంలో కూడా ఆలస్యంగానే వచ్చారుగదా"

"అవును, దురదృష్టవశాత్తూ ఇంకాస్త ఆలస్యంగా రాలేకపోయాను సరే. ఆ రోజు నువ్వుకూడా ఆలస్యంగా వస్తే సరిపోయేదిగా! మన పెళ్ళే జరిగుండేదికాదు. నా ఖర్మ ఇలా తగలడి ఉండేదికాదు. "

**కారుమీద** జోరుగా హుషారుగా సాగిపోతూన్న మందుభాయి చటుక్కున కారాపి రోడ్డుమీద నడుస్తూన్న వాడితో "ఏమండీ ఈ రోడ్డిలా విజయవాడ పోతుందా?" అడిగాడు. ఆ వ్యక్తి వినపడక జవాబివ్వలేదు. కోపం వచ్చి మందుభాయి బిగ్గరగా అదే ప్రశ్న వేశాడు. ఊహూఁ అయినా జవాబు లేదు. కారుని మూడు మైళ్ళు పోనిచ్చి అక్కడ కనిపించిన వేరే వ్యక్తిని మళ్ళీ అదే ప్రశ్న వేశాడు.

"ఎందుకయ్యా? అట్లా అరుస్తావ్. నువ్వడిగింది నాకు ముందే వినబడింది" అన్నాడు తాపీగా మందుభాయి వంక తిరిగి.

**మంగలిషాపులో** క్షవరం చేయించుకోబోతూన్న ఓ పెద్ద మనిషి అక్కడున్న పుస్తకాలన్నీ తిరగేసి "ఇదేమిటయ్యా! అన్నీ భయంకర హత్యలూ, దయ్యాలూ కథలున్న పుస్తకాలు పెట్టావు" అన్నాడు.

"వాటివల్ల నాపని సులభమవుతుందండీ" అన్నాడు క్షవరం చేసే వ్యక్తి.

కష్టమర్‌కి అర్థంకాక "ఎలా?" అన్నాడు.

"ఏముందండీ! కష్టమర్లు ఈ పుస్తకాలు చదివితే భయంతో వారి వెంట్రుకలు నిక్కబొడుచుకుని నిలబడతాయి. అప్పుడు వాటిని చాలా సులువుగా కత్తిరించవచ్చు" అన్నాడు క్షవరం చేశాయన తన పని చేసుకుపోతూ.

**"మనిద్దరం** ఆనందంగా ఏకాభిప్రాయంతో కలసివున్న తేదీలన్నీ ఓ చోట రాసివుంచానులే"

"నిజమా! ఏదీ ఆ డైరీ ఓసారి చూపించరూ" అంది భార్య.

"డైరీలో కాదే వెర్రిదానా! చెక్కుబుక్కులో రాసినవని"

**శేఖర్:** అయితే నిన్నెలా కలవమంటావు మళ్ళీ?

రమణి: ఏముందీ ఫోన్ చెయ్యి.

శేఖర్: అదే. నెంబర్?

రమణి: డైరెక్టరీలో ఉంటుంది చూడు.

శేఖర్: పేరు.. అదే ఫోనెవరి పేరుమీద ఉంది.

రమణి: అది కూడా నెంబరు ఎదురుగా డైరెక్టరీలో ఉంటుందిగా.

"**పద్మా!** పద్మా! ఇలారా. ఆ ఎదురింటి ఆవిడ చీర ఎంత అందంగా ఉందో, ఆవిడకు ఎంత చక్కగా మాచ్ అయిందో చూడు."

"చూడనక్కర్లేదు గానీ అతిశయోక్తులు చెప్పవద్దని మీకు లక్షసార్లన్నా చెప్పి ఉంటాను. గుర్తుంచుకోండి."

"**డబ్బు** పోతే పోయిందిగానీ ఈ చీర ఓ మనోహరకావ్యంలా ఉందంటున్నారండీ చూసినవాళ్ళంతా."

"ఒక కావ్యం ఏం ఖర్మ నాలుగు కథలు, రెండు కవితల ఖరీదని చెప్పు."

"**పాపా!** నువ్వు మీ అమ్మంతదానివి అయ్యాక ఏం చేద్దామనుకుంటున్నావు?"

"డైట్ కంట్రోల్ చేద్దామనుకుంటున్నాను"

COMMENTS